# నేను విన్న ఆకాశవాణి (నాటికా) కార్యక్రమాలు

"రోహిణి"

నవంబరు 19 రాత్రి 9-15 కు కీ॥ శే॥ చిలకమర్తి లక్ష్మీనృసింహంగారి రచన "గయోపాఖ్యానం" నాటకం నుంచి ఒక ఘట్టం "సుభద్రా రాయబారం" అనే పేరుతో బందా, బి. వి. రంగారావు, శ్రీరంగం గోపాలరత్నంగార్లు పదిహేను నిమిషాలపాటు ప్రసారం చేసారు. సంధి కలిసిన మాటలను విడదీసి సంధి కలిపే అక్షరంతో ఉచ్చరించటం బందావారు నిర్వహించేనాటికలోకూడా వినిపించటంనిజంగా ఆశ్చర్యం కలిగించినా శ్రీవారు భావయుక్తంగా చదివిన పద్యాలు బాగుండి నాటిక వినబుద్ధిఅంది.

నవంబరు 20 రాత్రి 9-15 కు టాల్‌స్టాయ్ కథ "మనిషి కెంత నేల కావాలి" ఆధారంగా శ్రీ తురగా కృష్ణమోహనరావు అదే పేరుతో రచించిన రూపకం సర్వహాణా, ప్రయోగమూ కూడా బాగాలేవు. హీరో పాత్రధారి ఆశాపాతకుడిగా కాక సంతృప్తాత్ముడిగా మాట్లాడారు. నాటికగా మార్చి కథలోని పట్టుపోగొట్టారు.

నవంబరు 21 టంగుటూరు సూర్యకుమారిగారు పాడిన దేశమును ప్రేమించుమన్నా గురజాడ అప్పారావుగారి గేయంతో ప్రారంభమైన ఈ నాటిక కార్యక్రమం వింజమూరి శివరామారావుగారు రచించిన కళింగ గంగు నాటికతో ముగిసింది. మధ్యలో జరిగిన కార్యక్రమాలలోని సంగీత కచేరీలో "ఎయోలా" వాయిద్యం ఉపయోగించినట్లు చెప్పారు. ఇంగ్లీషు ఎడ్యుకేషన్ ఇన్ ఇండియా సెమినార్ చాలా చక్కగా సాగింది. దేశాభిమానం ఎంత అవసరమో దురభిమానం లేకుండా మంచిని స్వీకరించడంకూడా అంతే అవసరం. అయితే దురదృష్టవశాత్తూ ఈ విషయం కొందరికి నచ్చడంలేదు. ఈవిషయములోఅనుభవజ్ఞులుచేసేసలహాలు వారికి ఉన్మత్త ప్రలాపాలలా వినిపిస్తున్నాయి. ఇలాటి సెమినార్‌లు తెలుగులోకికూడా అనువదించి వినిపించడం మంచిదనిపిస్తుంది ఇక కళింగ గంగు నాటిక "వేములవాడ భీమకవి" అనే పేరుతో కొంచెంగా మార్చి వినిపిస్తే మరీ బాగుండేది. జరుగుతున్న కథలో ప్రాత ఘట్టాలు (భీమకవి ప్రశస్తి) వచ్చినప్పుడు భీమకవిగారి గొంతు పద్యాలు చదవడం అదోలా ఉంది। కానీ బందావారు హుందాగా నిర్వహించిన భీమకవి పాత్ర ఈ నాటికలోని ఈ లోపాన్ని కప్పిపుచ్చి రక్తి కట్టించింది. వేములవాడ భీమకవి కథ తెలుగువారిది అచ్చం తెలుగువారిది. ఇతని కోపం తాటాకుమంట, హృదయం నవనీతం; ఈతని కథ వెండి తెరకెక్కించే ప్రయత్నం ఎందుకు ఫలించలేదో ? ఈ నాటిక విన్నాక ఈ కథ సినిమా తీస్తే ఎంత బాగుంటుంది అనిపించింది, నిర్వాహకులు అభినందనీయులు.

నవంబరు 25 ప్రాత నాటిక పాతకోటు మరో మారు ప్రసారమైంది. మర్నాటి రాత్రి వారఫలం నాటిక మల్లాది వెంకటకృష్ణశర్మ రచన చమత్కారంగానే ఉంది. ప్రసారం కూడా ఫరవాలేదు

నవంబరు 27 మధ్యాహ్నం 3 గంటల నుంచి 4-40 వరకు శ్రీ వాత్సవ రచించి, నిర్వహించిన నూరు సంవత్సరాల మన నాటకరంగం రూపకం ప్రశంసనీయంగా ఉంది. కోరాడ రామచంద్రశాస్త్రిగారు రచించిన మంజరీ మధుకరీయం మొదలు కొరపాటి గంగాధరావు వ్రాసిన నిజ రూపాలు నాటకం వరకూ; ప్రసిద్ధ పాశ్చాత్య కావ్యానుసరణ రాగ రాగిణి; పాశ్చాత్య నాటకాల క్షేమాత్రం తీసికోని శిల్పంతో రచించబడ్డ 'కీర్తిశేషులు' నాటకాన్ని కూడా ఈ కార్యక్రమంలో ప్రస్తావించిన రచయిత సంస్తవనీయులు. విజయవాడ ఆకాశవాణి నిలయంవారు సమర్పించిన ఈ రూపకం వినోదాత్మకంగానూ విజ్ఞానయుతంగానూ ఉన్నది. ఈ కార్యక్రమం తాలూకు ప్రకటన వాణికిచ్చేనాటికి ఇది ఒక గంటా నలుబై నిముషాలకి సాగుతుందని తెలియదల్లేవుంది విశిష్టమైన నాటకాలను నువ్వే ప్రదర్శించాలని ఆకాశవాణి నటి సూత్రధారుడితో అనేస్తే సరిపోదు. అందుకు ప్రతి చిన్న విషయంలోనూ శ్రద్ధ వహించాలి. ఈ ప్రసారంలో టైం షెడ్యూలు అతిక్రమించారు. కన్యాశుల్కంలో నుంచి ఎత్తుకున్న గురుశిష్య సంవాదంపట్ల ఎవరూ శ్రద్ధవహించినట్లు కనపడదు. ఇలాగే మరికొన్ని రంగాలు కూడా విశిష్టంగా ప్రయోగించలేకపోయారు. ఇవి ఆయా సమాజాలు ప్రత్యేకంగా ప్రయోగించారని తప్పుకోజూడవచ్చు కానీ సమర్పణ ఆకాశవాణి-విశిష్ట ప్రయోగానికీనాడు కంకణం కట్టుకున్న ఆకాశవాణి.

లోపాలకేం వాటి నలా ఉంచి అసలీనాడు (సరిగ్గా మొదటి నాటకం రచింపబడ్డ నూరవ ఏట) ఈ కార్యక్రమాన్ని సంకల్పించి సమర్పించిన ఆకాశవాణి నిర్వాకులందరికీ ఇందు పాల్గొన్న ప్రభృతులకూ అభినందనలు. నాటకాలను విశిష్టంగా

(తరువాయి 24 వ పేజీలో)


"ఆంధ్ర సర్వస్వము"

రచన:

శ్రీ మాగంటి బాపినీడు.

ఆంధ్రదేశ చరిత్ర, ఆంధ్ర ఉద్యమ పరిణామము. విజ్ఞానము పరిశ్రమలు. పటాస్కారు సరిహద్దు రిపోర్టుతోసహా వివిధ విషయములు వివరింప బడిన బృహత్ గ్రంథము ప్రతిఒక్కరు చదువతగినది. నేడే మీ కాపీ రిజర్వు చేసుకొనండి.

ప్రతులకు :

కొండపల్లి వీరవెంకయ్య & సన్స్

రాజమండ్రి.

## చెయ్యని నేరం-వెయ్యని శిక్ష

( 11 వ పేజీ తరువాయి )

తలుపు తట్టాడు. తలుపులు తెరువ బడ్డాయి. వంటింట్లో అహల్య చీరెను గుర్తుపట్టాడు. ఏవో చుయ్యమనిపిస్తోంది ఇంట్లో. రెండడుగులు వేశాడు ముందుకు. గదిలోకి మెల్లిగా తొంగిచూచాడు కళ్యాణి పుస్తకం పట్టుకుని కూర్చుంది. ప్రక్క వాకిటిలోంచి దొడ్లోకి వెళ్లాడు. స్నానాల గదిలో గాయత్రి మొహం కడుక్కుంటోంది. వంటింట్లో సంజీవి, భవానీ లిద్దరూ కూర్చుని ఏవో కబుర్లు చెప్పుతున్నారు. ఏమీ అర్థం కావటంలేదు. మళ్ళీ తిరిగి సావిట్లోకి వచ్చి నిలబడ్డాడు. అటూ ఇటూ చూశాడు, ఓ మూలగా బియ్యపుబస్తా మూతి ముడుచుకుని కూర్చునివుంది. తన కళ్ళను తాను నమ్మలేక పోయాడు.

కళ్యాణి పుస్తకం చేత పుచ్చుకునే మెల్లిగా సావిట్లోకి వచ్చింది. చప్పున ఉలిక్కిపడి నిలబడిపోయింది. ఒక్క క్షణం కూతుర్ని చూసి అతను ఉలిక్కిపడ్డాడు.

"అమ్మా! నాన్నగారొచ్చారే ." అంటూ గాయత్రి ఒక కేక పెట్టింది. భవానీ, సంజీవి చేతుల్లో పళ్ళాలతోనే సావిట్లోకి వచ్చేశారు, అహల్య కూడా చప్పున చేతులు కడుక్కుని వచ్చి నిలబడింది అందరూ సావిట్లోకి వచ్చి నిలబడిపోయారన్నమాటే గాని ఎవ్వరూకూడా ఏమీ మాటాడటం లేదు. కాంతారావు అంతకంటె మూగవాడయి పోయాడు. అహల్య తలవంచేసుకుంది. భర్తను ఎదురుగా చూడలేకపోయింది. ఓరకంటితో ఒక్కసారి కళ్యాణి వంక మాత్రంచూసి చప్పున లోపలికి వెళ్ళి, చెంబుతో నీళ్లుతెచ్చి ఇచ్చింది.

గాయత్రి తుండుగుడ్డ అందిచ్చింది. భవానీ, టిఫిన్ ప్లేటు అందిచ్చింది. సంజీవి కళ్యాణి తండ్రివంక బెరుకుగా చూస్తూ నిలబడి పోయాడు.

ఎవ్వరూ ఏమిమాట్లాడరే అని తీవ్రంగా మధనపడు తున్నాడు ఇంకో నిమిషం ఆగితే వాళ్లే మాట్లాడతార్లే అన్నట్లు క్షణం మౌనం వహించాడన్నమాటేగాని, తన ఆవేదనను, ఉద్వేగాన్ని ఆపుకోలేకపోతున్నాడు కళ్లార్పకుండా నలుగురివంకా ఒక్కసారి చూశాడు. ఎవరి కళ్లల్లోంచికూడా తాను అనుకున్న సమాధానం రాలేదు. పెద్ద నిట్టూర్పు విడిచాడు. పూర్తిగా అలసిపోయినట్లు కనిపించాడు. అహల్య, మెల్లిగా కాఫీకప్పును అందిచ్చింది భర్తకు.

(సశేషం)

## ఆకాశవాణి

(21 వ పేజీ తరువాయి)

ప్రయోగించాలనే వీరి సత్సంకల్పం నిరాఘాటంగా నెరవేరుగాక.

నవంబరు 30 రాత్రి 8 గంటలకు శ్రీ ఇసుకపల్లి దక్షిణామూర్తి రచించిన బ్రతుకు నేర్చిన వాళ్ళు అన్న నాటిక నాకు అర్థంకాలేదు. ఛాయాదేవి, రావూరి, భరద్వాజ మొదలగు ప్రఖ్యాతులు పాల్గొన్న ఈ నాటికలో ఏదో పదిమంది చెవిటివాళ్ళు కూర్చుని అరుచుకుంటూ మాట్లాడినట్లుంటే కాని ఒక నాటిక విన్నట్లులేదు. బోల్డు డబ్బు ఖర్చుచేసి ప్రసారంచేసే నాటికల ప్రయోగంపట్ల ఎందుకింత అలసత్వం వహిస్తారో అర్థంకాకుండా ఉంది.

డిసెంబరు 3 రాత్రి 9-15 కు శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావు రచించిన నాగరిక నాయిక కలాతో కాలేక ఈ రెంటి మధ్యా ఉండాల్సింది Mess అయిపోయి రైలుక్రిందపడ్డ అజ్ఞాతవ్యక్తి చరిత్రలాగుంది! అసలీవ్యక్తి రైలుదగ్గరకి ఎందుకు వచ్చాడు? వచ్చెటో దానిక్రింద ఎందుకు పడ్డాడు? పడెనయ్యా గుర్తుతెలీకండా ఎందుకిలా ఐపోయాడు? అనే ప్రశ్నలుకూడా అనవసరమేకదా! అయినా పంచాయతీకి వచ్చుకున్నాం కనుక ప్రస్తావన తప్పలేదు. వాణీబాల మాటలు వినిపించాయి కనుక "లిడుస్టిక్కు" అంటే అర్థంతెలీకపోయినా (నాకు) నాటిక ఆసాంతం విన్నాం.

డిసెంబరు 4 మధ్యాహ్నం 3 గంటల లగాయతు 4 గంటలవరకూ లోగడ ఒకమారు ప్రసారమైన మహోరుద్రీయం నాటిక మరోమారు ప్రసారింప బడింది. రచన కన్న స్వామిగారు. నిర్వహణ బందావారు పాత్రధారులు తగుసమర్థులు.

—:O:—

## గ్రంధ సమీక్ష

( 20 వ పేజీ తరువాయి )

ఇసుప కటకటాలు చాలవు.
నేరానికి భంగపాటు శిక్ష.
అమాయిక ప్రజల చూపులు,
కుప్పించి శోషిల్లే స్త్రీలు, బాలికలు
నల్ల వ్యాపారానికి పరిహద్దులు.
న్యాయాన్ని, పరమ న్యాయ సూత్రాన్ని
ధర్మాన్ని, ధైర్యాన్ని, సత్యాన్ని
చెపుతున్న సంఘాన్ని నేను
కోపగిస్తున్నాను నేను"- అంటారు.

ఒక్కొకసారి యీ రచయిత ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించగలరు. ఏవో తీరని కోరికలు పెంచుకోగలరు:

తూరుపుతీరములో తోచిన తొలిరేఖల
సౌరును చూచిన సమయంములో నాలో
తీరనికోరికలెన్నో పొడసూపును

అంటారు, ఇంకా కొందరు ప్రఖ్యాత ఆంగ్లకవులు వ్రాసిన గేయాలు చదివి తెలుగులో వ్రాసిన గేయాలు వున్నాయి.

శ్రీ రాంభట్ల లక్ష్మీనారాయణశాస్త్రిగారు వీరి కవితను పరిచయంచేస్తూ.

"ఆవేశ కవితకు అనుకరించారనవచ్చును లేదా అనువదించారనిచ్చును. నగ్నసత్యాలను వరుల వ్యాదయ సీమలలో నాటేరనవచ్చును హృదయం వికసిస్తేగాని యిట్టిధార లభింపదని చెప్పవచ్చును. ఆధునిక సమాజానికి ఆదర్శంగా వీరి భావావేశం పరుగు లిడుతూంది. వీరి లేఖిని మృదు మధుర భావాలని వర్షిస్తూంది. ఇంకా ప్రగతిలో ముందంజ వేస్తుందని ఆశిస్తున్నాం. అభ్యుదయానికి పీఠికల్పనలో అంతుదొరకని పునాదులు" అన్నారు నిజం.



Source: Press Academy Website, Chukkani, Dec 1960

Disclaimer: This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation. Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan

http://www.maganti.org/